www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 7 నవంబర్ 2024

5

తూర్పుగోదావరి



రేపు ఇండస్ట్రియల్ విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-కడియం

ఈ నెల 8వ తేదీ శుక్రవారం ఉదయం 08:00 గంటల నుంచి మధ్యాహ్నం 02:00 గంటల వరకు 33/11కెవి మురమండ సబ్ స్టేషన్ నుండి సరఫరా అయ్యే 11 కెవి ఇండస్ట్రియల్ ఫీడర్ వార్షిక మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు రాజమహేంద్రవరం రూరల్ విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డాక్టర్ శ్రీధర్ వర్మ పేర్కొన్నారు. మండలంలోని మురమండ, దుళ్ల, వీరవరం, పొట్టిలంక గ్రామాలలోని ఇండస్ట్రియల్ విద్యుత్ వినియోగదారులకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

టీచర్ ఎంఎల్‌సికి 16,316 మంది ఓటర్లు

- పురుషులు 9,674, స్త్రీలు 6,642
- తుది జాబితాను వెల్లడించిన రిటర్నింగ్ అధికారి, కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి



ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఉమ్మడి తూర్పు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి మొత్తంగా 16,316 మంది ఓటర్లు నమోదయ్యారు. తుది ఓటర్ల జాబితాను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సిగిలి బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ప్రకటించారు. టీచర్ ఎంఎల్‌సికి సంబంధించిన ఫైనల్ ఓటర్ల జాబితాను ప్రచురించామన్నారు. కలెక్టర్ కార్యాలయాలు, సబ్ కలెక్టర్ కార్యాలయాలు, ఆర్‌డిఒ కార్యాలయాలు, తహశీల్దార్, ఎంపిడిఒ, మున్సిపల్, ఎంఇఒ, పోలింగ్ స్టేషన్లలో బుధవారం నుంచి హార్డ్ కాపీ, సాఫ్ట్ కాపీని అందుబాటులో ఉంచుతామన్నారు.

ఉమ్మడి తూర్పు - పశ్చిమగోదావరి జిల్లాలో 113 మండలాల్లో మొత్తంగా 16,316 మంది ఓటర్లు ఉన్నారన్నారు. అందులో పురుషులు 9,674 మంది, స్త్రీలు 6,642 మంది ఉన్నారని తెలిపారు. 116 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 11 మండలాల్లో 12 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని 614 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో 19 మండలాల్లో 20 పోలింగ్ కేంద్రాలు 2,893 మంది ఓటర్లు, ఏలూరు జిల్లాలో 20 మండలాల్లో 20 పోలింగ్ కేంద్రాలు 2,605 మంది ఓటర్లు, కాకినాడ జిల్లాలో 21 మండలాల్లో 22 పోలింగ్ కేంద్రాలు 3,333 మంది ఓటర్లు, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 22 మండలాల్లో 22 పోలింగ్ కేంద్రాలు, 3,209 మంది ఓటర్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 20 మండలాల్లో 20 పోలింగ్ కేంద్రాలు 3,662 మంది ఓటర్లు ఉన్నారని ఆయన తెలిపారు.

11 నుంచి నామినేషన్లు స్వీకరణ

టీచర్స్ ఎంఎల్‌సికి సంబంధించి ఈనెల 11 నుంచి 18 వరకూ కాకినాడ కలెక్టర్ కార్యాలయంలోని కోర్టు హాల్లో నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఆయా తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు.

ఈ ఎన్నికకు సంబంధించి కాకినాడ జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారి ఉంటారని, కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు జిల్లాలు డిఆర్‌ఒలు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తారని తెలిపారు.

23 వరకూ గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఓటర్ల నమోదు

ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు గడువును ఈ నెల 23 వరకూ పెంచారన్నారు. ఈనెల 6తో గడువు ముగిసిందని, దీనికి సంబంధించి 23న డ్రాఫ్ట్ పబ్లికేషన్ వస్తుందన్నారు. ఈనెల 7వ తేదీ నుంచి 23 వరకూ ఓటరుగా నమోదు చేసుకున్న వారి పేర్లు డిసెంబర్ 30న ప్రచురించే ఫైనల్ పబ్లికేషన్‌లో కనిపిస్తాయని తెలిపారు. ఎవరైనా ఓటు నమోదు చేసుకోకపోతే ఈనెల 23 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2024 నవంబర్ 1కి మూడు సంవత్సరాల ముందు డిగ్రీ పూర్తి చేసిన వారు గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. 15 సంవత్సరాల స్టడీ కంప్లీట్ చేసి ఉండాలని ఆయన తెలిపారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఇప్పటివరకు 1,74,772 మంది ఓటర్లుగా నమోదయ్యారని తెలిపారు. దీనికి సంబంధించి అల్లూరి సీతారామరాజు జిల్లాలో 12 పోలింగ్ కేంద్రాలు, తూర్పుగోదావరి జిల్లాలో 61 పోలింగ్ కేంద్రాలు, ఏలూరు జిల్లాలో 45 పోలింగ్ కేంద్రాలు, కాకినాడ జిల్లాలో 63 పోలింగ్ కేంద్రాలు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 53 పోలింగ్ కేంద్రాలు, పశ్చిమగోదావరి జిల్లాలో 65 పోలింగ్ కేంద్రాలు మొత్తం 299 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో కాకినాడ డిఆర్ఒ జె.వెంకట్రావు, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ జగన్నాథరావు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐవి, ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ ధర్నా

మద్దతు తెలిపిన పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, విద్యారంగంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన స్థానిక సబ్ కలెక్టరేట్ వద్ద విద్యార్థులు బుధవారం ధర్నా నిర్వహించారు.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, జిఒ 77ను రద్దు చేయాలని, అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని నినదించారు. ఈ ధర్నాకు పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థుల సమస్యలను శాసన మండలిలో ప్రస్తావిస్తానన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ3,480 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. జిఒ 77ను రద్దు చేసి పీజీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ వచ్చేలా చూడాలన్నారు. యూనివర్సిటీల్లో అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్.రాజా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. జిల్లాలో ప్రధానంగా సంక్షేమ హాస్టల్స్‌లో ఎక్కువ మంది విద్యార్థులు ఉంటున్నారని తెలిపారు. రూమ్‌కు 20 మంది ఉండాల్సి ఉండగా, 45 మంది ఉంటున్నారని తెలిపారు. కావున అదనంగా అబ్బాయిలకు, అమ్మాయిలకు 4 నూతన హాస్టల్స్ నిర్మించాలన్నారు. ఎస్‌టి హాస్టల్-2 అద్దె భవనంలో నడుస్తోందని, వెంటనే నూతన భవనం నిర్మించాలన్నారు. ఆర్ట్స్ కళాశాలలో తరగతి గదులు నిర్మించి తక్షణమే రెండు పూటలా క్లాసులు నిర్వహించేలా చూడాలన్నారు. కందుకూరి ఆస్తులను తక్షణం ప్రభుత్వం తీసుకోవాలని, కందుకూరి రాజ్యలక్ష్మి కళాశాలలో డిగ్రీ, ఇంటర్ వేరు వేరుగా నడపాలన్నారు. ఇంటర్‌కు నూతనంగా ప్రిన్సిపల్‌ను నియమించాలన్నారు. రంగంపేట మండలంలో డిగ్రీ కళాశాల నిర్మించాలని, రైల్వే గూడ్స్‌గేట్ దగ్గర ఉన్న జూనియర్ కళాశాలలో ఒకేషనల్ కళాశాలను వేరు చేసి నూతనంగా కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు ఎస్‌సి, ఎస్‌టి నాయకులు కోరుకొండ చిరంజీవి మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు జ్యోతి, కనక, సాహితి ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, మణికంఠ, మౌళి, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతన్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజా

కార్యకర్తలకు అండగా ఉంటాం : వైసిపి

ప్రజాశక్తి-గోపాలపురం

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామని ఎవ్వరూ అధైర్యపడవద్దని మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. గోపాలపురంలోని కూసం రామమోహన్‌రెడ్డి నివాసం వద్ద బుధవారం పార్టీ నాయకులతో మాజీ మంత్రి తానేటి వనిత అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో దాడులు పెరిగిపోయాయన్నారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను పట్టించుకోకుండా వైసిపి నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని తెలిపారు. ఎవ్వరూ అధైర్యపడవద్దని పిలుపునిచ్చారు. దాడులకు బయపడే ప్రసక్తే లేదని సంక్షేమ పథకాలు అమలు చేయకుండా వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. గ్రామ స్థాయి నుండి పార్టీ బలోపేతానికి నాయకులు కార్యకర్తలు నడుం బిగించాలన్నారు. ప్రతిపక్షంలో ఉంచి ప్రజల పక్షాన పోరాటాలు చేయాలన్నారు. మాజీ హోమ్‌మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ఎవరికి ఏ సమస్య వచ్చినా కార్యకర్తలకు అండగా ఉంటామని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజానగరం మాజీ ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా, ఇళ్ల బాస్కరరావు, ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, జెడ్‌పిటిసి కాకులపాటి లలిత సాగర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వేణు, వనిత, రాజా

రైతు సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు మండలంలో నెలటూరు, ఉన్నగట్లలో ఆమె బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండలంలోని నెలటూరు, ఆర్‌బికె కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసే విధానాలను, రైతులకు అందుతున్న తక్షణ సేవలను ఆమె సిబ్బందిని, రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతు ఖాతాలో సొమ్ము జమ చేస్తామన్నారు. ఆర్‌బికె కేంద్రాల్లో రైతులకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ధాన్యం తేమశాతం తదితర వివరాలు సక్రమంగా నమోదు చేసి రైతుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా యంత్రాంగం పనిచేయాలని ఆమె సూచించారు. తహశీల్దారు ఎం.మేరికమ్మతో పాటు పలువురు అధికారులు ఆమె వెంట ఉన్నారు.



సదస్సులో పాల్గొన్న విద్యార్థినులు

లింగ నిర్ధారణ పరీక్షలపై అవగాహన

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

బొమ్మూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినులకు బుధవారం పిసిపిఎన్‌డిటి చట్టం గురించి, గర్భస్థలింగ నిర్ధారణ పరీక్షల గురించి అవగాహన కల్పించారు. ఆడ మగ నిర్ధారణ పరీక్షలు జరుగుతుంటే వెంటనే తెలియజేయాలని విద్యార్థులకు కసూచించారు. ఆడపిల్లలు దేశానికి పట్టుకొమ్మలని, భేటీ పడావో భేటీ బచావో లాంటి ఎన్నో మంచి కార్యక్రమాలను రూపకల్పన చేశారని తెలిపారు. ఆడ, మగ అనే వ్యత్యాసం చూపించరాదని డిప్యూటీ డిఎంఒ ఎన్.సత్యకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇ వెంకటరమణ, సూపర్వైజర్స్ శ్రీనివాస్, ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఆర్‌డిఎస్ఎస్ పనుల నిమిత్తం గురువారం ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకూ పాలంగి సబ్ స్టేషన్ పరిధి, గ్రామంలో విద్యుత్ సరఫరా తాత్కాలిక నిలుపుదల చేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నిడదవోలు ఎన్.నారాయణ అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వినియోగదారులు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

నిత్యావసరాల ధరలపై పర్యవేక్షణ తప్పనిసరి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలపై పర్యవేక్షణ తప్పనిసరి అని కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరు క్యాంపు కార్యాలయంలో ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఉల్లిపాయలు, ఆయిల్ సబ్సిడీ ధరల్లో వినియోగదారులకు అందుబాటులో ఉంచుతున్నా, తగిన ప్రచారం కల్పించడంలో నిర్లక్ష్యం కారణంగా వినియోగదారులు ఎక్కువ మొత్తం చెల్లించాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మేరకు తక్కువ రేటుకు ఆయిల్, ఉల్లిపాయలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు. జాయింట్ కలెక్టర్ సమక్షంలో ప్రతిరోజూ ధరలు వ్యత్యాసాలు, ఎక్కడ లభ్యత అవుతుందో తెలుసుకుని, ఆ మేరకు రైతు బజార్లలో, మార్కెటింగ్, పౌర సరఫరాల, స్వయం సహాయక సంఘాల మహిళల అధ్వర్యంలో మరిన్ని ఔట్‌లెట్స్ ఏర్పాటు దిశగా అడుగులు వేయాలని కలెక్టర్ ఆదేశించారు. రేపటి నుంచి రైతు బజార్లలో, ఇతర ఔట్ లెట్స్ వద్ద రేట్ చార్ట్‌లు ఏర్పాటు చేయాలన్నారు. బియ్యం, ఆయిల్, ఉల్లిపాయలు, కందిపప్పు రోజువారీ అమ్మకాల వివరాలు ఎస్టేట్ ఆఫీసర్లు అందజేయాలన్నారు. పామాయిల్ ఎంఆర్‌పి రూ.116 ఉండగా రైతు బజార్లలో రూ.110కు, సన్ ఫ్లవర్ ఆయిల్ ఎంఆర్‌పి రూ.165 ఉండగా రైతూ బజార్లో రూ.124కే లభ్యం అవుతోందని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు తెలిపారు. వినియోగ దారులకు ఫైన్ రకం బియ్యం కేజీ రూ.47 చొప్పున, కందిపప్పు రూ.150 కే అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఇతర కూరగాయల ధరలు విషయములో హేతుబద్ధత కలిగి ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ధాన్యం సేకరణ వేగవంతం చెయ్యాలని, క్షేత్ర స్థాయిలో కోతలు చేపడుతున్న ఆర్ఎస్ కె వారీగా వివరాలు సేకరించి, వాటిని ఎక్కడ విక్రయం చేస్తున్నారు, తదితర అంశాలపై దృష్టి పెట్టాలని కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. నల్లజర్ల, కొవ్వూరు, చాగల్లు, నిడదవోలు పరిధిలో ఖరీఫ్ సీజన్ కోతలు జరుగుతున్నాయని, పెరవలిలో కోతలు ప్రారంభం అయ్యాయని అధికారులు వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సగటున వెయ్య మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తున్నారని, క్షేత్ర స్థాయిలో కోతలు 3 వేల మెట్రిక్ టన్నుల ఉండగా మిగిలిన వాటికి చెందిన వివరాలు సేకరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులకు ప్రభుత్వం నిర్దేంచిన కనీస మద్దతు ధర కంటే ఎక్కువగా లభించేలా పర్యవేక్షణ చేయాలన్నారు. బ్యాంక్ గ్యారంటీ జమ చెయ్యని వాటికీ బ్లాక్ లిస్టులో పెట్టవలసిన అవసరం ఉందన్నారు. క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యటన సందర్భంలో అక్రమ నిలువల్ని గుర్తించే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. క్షేత్ర స్థాయి పర్యటనలు మొక్కుబడిగా చేయ కూడదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్, ఎస్.చిన్న రాముడు, డిఎస్ఒ, కెవిఎస్ఎం.ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి, ఎస్.మాధవరావు, లీగల్ మెట్రాలజీ ఎసి, కె.సామ్యూల్ రాజు, ఎడి మార్కెటింగ్ ఎం.సునీల్ వినయ్, వాణిజ్య పన్నుల అధికారి, కె.రాజశేఖర్, ఆయిల్స్ ప్రెసిడెంట్ పి.సురేష్ కుమార్, పప్పు దినుసుల ప్రెసిడెంట్, పి.పెరు మాళ్ళు, ఉల్లిపాయలు ట్రేడింగ్ ప్రెసిడెంట్ మజ్జి రాంబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

నేడు పొగాకు రైతులకు అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

గురువారం జిల్లా వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో పొగాకు రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎఒ తెలిపారు. ఉదయం పది గంటలకు పంట డీ వెరిఫికేషన్‌పై ఇనగంటివారిపేటలో ద్వారకా తిరుమల ఫంక్షన్ హాల్లో జరుగుతుందన్నారు. పొగాకు పండించే రైతులందరూ తప్పనిసరిగా అవగాహన సదస్సులో పాల్గొనాలని తెలిపారు.

మునికోటేశ్వరరావుకు రాంబాబు అభినందన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ప్రముఖ పారిశ్రామికవేత్త, దాత ముక్కిన అక్కిన మునికోటేశ్వరరావు తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మెంబర్‌గా నియమితులైన సందర్భంగా స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు ఆయననుకలిసి అభినందించారు. బుధవారం స్థానిక విద్యానగర్‌లోని కోటేశ్వరరావు స్వగృహంలో రాంబాబు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా సాధారణ భక్తులకు సౌకర్యవంతమైన, సరలీకృతమైన నియమ నిబంధనలు ఉండేలాగా పాలకమండలిలో చర్చించాలని అందుకు కోటేశ్వరరావు కృషి చేయాలని రాంబాబు కోరారు. కోటేశ్వరరావు కుటుంబం స్వర్ణాంధ్ర సేవా సంస్థకు అందించిన సహకారాన్ని రాంబాబు గుర్తు చేశారు. రాంబాబుతో పాటు స్వర్ణాంధ్ర సభ్యులు బత్తుల భరణితాతేశ్వర్, సంపంగి చిన అప్పలనాయుడు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు చాగల్లు విద్యార్థులు

ప్రజాశక్తి-చాగల్లు

గత నెల 30న దేవరపల్లి మండలం పల్లంట్లలో జరిగిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో చాగల్లు విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ జె.విజయలక్ష్మి తెలిపారు. ఎంపికైన వారిలో గీత. ఎం.తేజశ్రీ, వినయ విధేయ ఉన్నారు. విద్యార్థులను, కోచ్ ప్రేమ్ చందును హెచ్ఎం వీర్రాజు, విద్యా కమిటీ చైర్మన్ గోపాలకృష్ణ, కమిటీ సభ్యులు భగవాన్ అభినందించారు.

పిడుగుపాటు ఘటనలో మరొకరు మృతి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

గత నెల 30న మండలంలోని సూర్యారావుపాలెం గ్రామ శివారులో దీపావళి బాణసంచా తయారీ కేంద్రంపై పిడుగు పడిన సంఘటనలో చికిత్స పొందుతూ బుధవారం మరొకరు మృతి చెందారు. ఆ రోజు ఘటనా స్థలంలోనే వేగిరోతు శ్రీవల్లి, గుమ్మడి సునీత దుర్మరణం పాలు కాగా ఐదుగురు తీవ్ర గాయాల పాలయ్యారు. వారికి మెరుగైన చికిత్స అందించేందుకు ఆసుపత్రికి తరలించారు. వారిలో ఒక్కొక్కరూ ఇప్పటివరకు నలుగురు మరణించగా బుధవారం చుక్కా పెద్దింట్లు (45) మృతి చెందారు. దీంతో ఈ ఘటనలో మృతి చెందిన వారి సంఖ్య ఏడుకు చేరుకుంది.

సాంస్కృతిక వైభవంపై నన్నయలో నేడు సదస్సు

ప్రజాశక్తి-రాజానగరం


ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఈ నెల 7, 8 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం సదస్సు నిర్వహిస్తున్నామని సాంస్కృతిక వైభవాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు సమష్టిగా సహకరించి జయప్రదం చేయాలని విసి ఆచార్య వై శ్రీనివాసరావు తెలిపారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ, సెంటర్ ఫర్ ఆంధ్రప్రదేశ్ స్టడీస్ (కాప్స్) మధ్య జరిగిన ఎంఒయులో భాగంగా కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నారని చెప్పారు. యూనివర్సిటీ ఎన్‌టిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించే ఈ సదస్సు ప్రారంభోత్సవానికి జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ న్యూఢిల్లీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ శాంతిశ్రీ ధూళిపూడి పండిట్ హాజరవుతారని, 8న జరిగే ముగింపు కార్యక్రమానికి టూరిజం, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, రాజానగరం ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ హాజరవుతారని చెప్పారు. సదస్సుకు కన్వీనర్లుగా ఆచార్య కె.శ్రీరమేష్, ఆచార్య డి.జ్యోతిర్మయి డాక్టర్ ఎన్.సజనారాజ్ వ్యవహరిస్తున్నారని అన్నారు. సదస్సు నిర్వహణకు రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, సెంటర్ ఫర్ ఆంధ్రప్రదేశ్ స్టడీస్ (కాప్స్) ప్రెసిడెంట్ కర్రి రామారెడ్డి, సెక్రటరీ ఓలేటి సత్యనారాయణ సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. ఈ సెమినార్‌లో ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మౌలిక ఆస్తిత్వాన్ని ప్రభావితం చేసే అంశాలపై పత్ర సమర్పణలు జరుగుతాయన్నారు. అవధానం, దండకం, శతకం, పద్యకవిత్వం వంటి సాహిత్య ప్రక్రియలు, కూచిపూడి, ఆంధ్రనాట్యం, దింసా గిరిజన నత్యాలు వంటి జానపద, సాంప్రదాయ నత్య రీతుల అవిర్భావం, విస్తృతిపై, ఎపిలోని వివిధ జానపద కళారూపాలు, బుర్రకథ. హరికథ, తోలు బొమ్మలాట, తప్పెటగుళ్ల మొదలైన సాహిత్య జానపద సంస్కృతిక అంశాలపై చర్చలు జరుగుతాయన్నారు. సాంస్కృతిక వైభవం ప్రతిబింబించే విధంగా సమష్టి కృషితో సదస్సును జయప్రదం చేయాలని సూచించారు.

ఉచితంగా హెల్మెట్ల పంపిణీ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాదాలపై అవగాహనా కార్యక్రమంలో జిల్లా జడ్జి గంధం సునీత ముఖ్య అతిథిగా హాజరై పలువురికి ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గంధం సునీత మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాలు, హైకోర్టు సూచనల మేరకు ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్స్ పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. వాహనం నడిపే వారందరూ తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలన్నారు. హెల్మెట్లు ధరించని కారణంగా ప్రమాద సమయంలో గాయాలు ఎక్కువగా తగిలే అవకాశం ఉందని తెలిపారు. గత మాసంలో ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా ర్యాలీ నిర్వహించినట్టు తెలిపారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద బ్యాంకర్స్, హర్లిక్స్ ఫ్యాక్టరీ, ఎపి పేపర్ మిల్క్ యాజమాన్యాలతో సంప్రదించి వారి సహకారంతో హెల్మెట్ పంపిణీ ప్రక్రియకు జాబితాను సిద్ధం చేసినట్టు తెలిపారు. ఇందులో భాగంగా హెల్మెట్ కొనుగోలు చేయలేని ప్రభుత్వ కళాశాలలో పేద విద్యార్థులకు, జూనియర్ అడ్వకేట్లకు గత 15 రోజుల క్రితం 148 హెల్మెట్లను పంపిణీ చేశామన్నారు. స్టేట్ బ్యాంక్, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా సహకారంతో 250 హెల్మెట్లను పంపిణీ నిమిత్తం అందచేశారన్నారు. నేడు ప్రభుత్వ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న బాలికలు, బాలురుకు, జూనియర్ అడ్వకేట్లకు హెల్మెట్లను పంపిణీ చేస్తున్నామన్నారు. హెల్మెట్లను పంపిణీ చేసిన బ్యాంకర్ల ప్రతినిధులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సేవాధికార సంస్థ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్ బాబు, బార్ అసోసియేషన్ సెక్రెటరీ పి.రమేష్, ఎస్‌బిఐ రీజినల్ మేనేజర్ టి.శ్రీనివాస్, కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ జి.రఘుకుమార్, బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ కెవిఎన్, ప్రసాద్ ఆర్ట్స్ కళాశాల, ఉమెన్స్, ఎస్‌కెవిటి కళాశాల విద్యార్థులు, జూనియర్ అడ్వకేట్లు పాల్గొన్నారు.


కార్టూ'నిజం'



రిటైర్డ్ అయిన వారికి మళ్లీ ఉద్యోగాలు అన్యాయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రైల్వేలో రిటైర్డ్ అయిన వారికి మళ్లీ ఉద్యోగాలివ్వడం అన్యాయని స్టేషన్ మాస్టర్‌కు డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వి.రాంబాబు, సిఐటియు జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమరాజు, బుధవారం వినతిపత్రం ఇచ్చారు. జిల్లా కన్వీనర్ వి.రాంబాబు, పూర్ణిమ రాజు మాట్లాడుతూ రైల్వే శాఖలో రిటైర్డ్ ఉద్యోగులను తీసుకోవాలనే కేంద్ర ప్రభుత్వ ఆలోచనలను విరమించుకుని ఖాళీగా ఉన్న 2.98 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేసారు. భారతదేశంలో ప్రపంచంలో ఎక్కడా లేనంత యువశక్తి ఉన్నప్పటికీ ఉపాధి కల్పనలో బిజెపి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిదన్నారు. దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 9.8 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసి యువతకు ఉపాధిని దూరం చేస్తోందన్నారు. భారత రైల్వేలో ఇప్పటికే బాగా లాభాలు వచ్చే రైల్వే లైన్లను, రైల్వే స్టేషన్లను పార్సిల్ క్యాటరింగ్ లాంటి వాటిని ప్రైవేటు వారికి అప్పజెప్పడం వల్ల సామాన్య మధ్య తరగతి ప్రజానీకానికి సర్వీసులు చాలా ఖరీదుగా మారాయని తెలిపారు. రైల్వేలో 2023 జూన్ 1 నాటికి 2,61,233 పోస్టులు అందులో కేవలం సేఫ్టీ కేటగిరీలో 53,178 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ రాజ్యసభలో లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం అవి 2.89 లక్షలు ఖాళీగా ఉన్నట్టు తెలిపారు. తక్షణమే రిటైర్డ్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకునే ఆలోచనను వెనక్కి తీసుకొని రైల్వేలో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటికీ నోటిఫికేషన్లు విడుదల చేయాలని, సాధారణ ప్రజలకు రోజువారీగా సాధారణంగా వచ్చే జబ్బుల మందులపై విపరీతంగా రేట్లు పెంచుకోవడానికిఇచ్చిన అనుమతిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.



వినతిపత్రం అందిస్తున్న నాయకులు



వధువుకు చెక్కు అందజేస్తున్న టిడిపి నాయకులు

వధువుకు జ్యోతుల ఫౌండేషన్ సాయం

ప్రజాశక్తి-గోకవరం

జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా మండలంలోని తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన సారపురెడ్డి శ్రీను కుమార్తె వెంకటలక్ష్మికి పెళ్లి మండపం వద్ద రూ.20 వేల చెక్కును బుధవారం టిడిపి నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైతు ఉపాధ్యక్షులు అడపా భరత్ కుమార్, మండల కన్వీనర్ మంగరౌతు రామకృష్ణ, సర్పంచ్ పురంశెట్టి శివాజీ మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నియోజవర్గంలో ప్రతి నవ వధువుకూ రూ.20 వేలు నెహ్రూ ట్రస్ట్ తరుపున అందిస్తామని తెలిపారు, టిటిడి బోర్డు మెంబర్, స్థానిక ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ ఆర్గనైజింగ్ సెక్రెటరీ మండిగ గంగాధర్, మండల తెలుగు యువత అధ్యక్షులు గుండా శివ ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి రఘువీర్ విష్ణు

హత్య కేసులో ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కాజులూరు మండలం శలపాక గ్రామంలో గత నెల 31న జరిగిన ముగ్గురి హత్యకు కారకులైన ఐదుగురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు డిఎస్‌పి రఘువీర్‌విష్ణు తెలిపారు. స్థానిక సర్పవరం సర్కిల్ పోలీస్‌స్టేషన్లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎదురుఎదురు ఇళ్లలో నివాసం ఉంటున్న బత్తుల చిన్నయ్య, పొట్లకాయల నాగేశ్వరరావు కుటుంబాల మధ్య మనస్పర్థలు కారణంగా ఈ సంఘటన చోటుచేసుకుందని అన్నారు. దీపావళి రోజున ఒక పథకం ప్రకారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో పొట్లకాయల నాగేశ్వరరావు, అతని భార్య బేబి, వారి కుమారులు సుబ్రమణ్యం, దొరబాబు, వినోదు ఇనుప రాడ్లు, మంచం పట్టి కర్రలతో బత్తుల చిన్నయ్య, అతని కుమారుడు బత్తుల రమేష్, తమ్ముడు బత్తుల రాజుపై విచక్షణ రహితంగా దాడిచేసి అతి కిరాతంగా హత్య చేశారని చెప్పారు. వారిని అడ్డుకోబోయిన బత్తుల శ్రీనుపైనా దాడి చేసి గాయపర్చారని తెలిపారు. ప్రాథమిక విచారణ అనంతరం నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. శలపాకల గ్రామంలో ఎటువంటి సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ చైతన్యకృష్ణ, కాజులూరు ఎస్‌ఐ మోహన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పాన్ షాప్‌లో చోరీ

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉప్పాడ రింగ్ రోడ్డు సెంటర్ సమీపంలో ఉన్న పాన్ షాప్‌లో గుర్తుతెలియని దుండగులు మంగళవారం అర్ధరాత్రి చోరీ చేసినట్లు షాపు యజమాని బండి శ్రీను బుధవారం తెలిపారు మంగళవారం రాత్రి దుకాణాన్ని మూసివేసి వెళ్లి బుధవారం వ్యక్తిగత పనులపై యానం వెళ్లి సాయంత్రం దుకాణం తెరవగా పైకప్పుకు రంధ్రం పడి ఉందన్నారు. పై కప్పుకు రంధ్రం పెట్టి లోపలకు దిగి సుమారు రూ.20 వేలు విలువ చేసే సరుకులు దోచుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.



అధికారులు స్వాధీనం చేసుకున్న గ్రావెల్ ట్రాక్టర్

గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ స్వాధీనం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పుష్కర కాలువ గట్టు నుంచి అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ ట్రాక్టర్‌ని మంగళవారం రాత్రి రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ ట్రాక్టర్‌ని తహశీల్దార్ కెవివి.సత్యనారాయణ ఆదేశాలతో గొల్లప్రోలు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నాటు సారా బట్టీపై దాడి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

శంఖవరం మండలం రాజవరం గ్రామ పరిసరాల్లో ఉన్న నాటు సారా బట్టీపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నాటు సారా తయారీకి సిద్ధం చేసిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సిఐ పి.శివప్రసాద్ మాట్లాడుతూ ప్రత్తిపాడు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో నాటు సారా స్థావరాలపై నిఘా పెట్టామని అన్నారు. ఎవరైనా నాటు సారా తయారీ చేస్తే ఖఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ పి.వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుని దుర్మరణం

ప్రజాశక్తి - కాట్రేనికోన

చెయ్యేరు హైస్కూల్ వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పల్లంకురు శివారు పోర పొన్నాడ గట్టుకు చెందిన పాలెపు అంజి(20) అక్కడికక్కడే మరణించాడు. చెందాడు. అమలాపురం రొయ్యలు కంపెనీలో పనిచేస్తున్న అంజి తన బంధువుతో కలిపి ఇంటికి వెళుతుండగా చెయ్యేరు హై స్కూల్ సమీపంలో ఎదురుగా వస్తున్న ఐషర్ వ్యాన్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. సంఘటన స్థలంలో మృతుని కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంధువులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు.సంఘటన జరిగిన స్థలానికి పోలీసులు చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా హాస్పిటల్‌కు తరలించారు.

వరకట్నం వేధింపులపై కేసు

ప్రజాశక్తి-నల్లజర్ల

తన భర్త వరకట్నం కోసం చిత్ర హింసలకు గురి చేస్తున్నాడని భార్య నల్లజర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతపల్లి గ్రామానికి చెందిన కపిల బాలనాగ వీర వెంకటలక్ష్మికి 2003లో కొయ్యలగూడెం గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్‌తో వివాహం అయ్యింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వివాహం అయినప్పటి నుండి ఆమె తీసుకొచ్చిన కట్నం సరిపోలేదంటూ భర్త పలుమార్లు ఆమెను పుట్టింటికి పంపించేవాడు. ఈ క్రమంలో ఈ ఏడాది మే నెలలో ఆమెను భర్త పుట్టింటికి పంపించగా గ్రామ పెద్దలు పరిష్కరించి ఆమెను భర్త వద్దకు పంపించారు. అయినప్పటికీ భర్త ప్రవీణ్ కుమార్‌లో ఎలాంటి మార్పు రానందున మరల చిత్రహింసలకు గురి చేయడంతో ఆమె నల్లజర్ల పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. దీంతో భర్త ప్రవీణ్ కుమార్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

రైతుల సమస్యలపై నాయకుల సమీక్ష

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు గ్రామంలోని రామాలయం వద్ద బుధవారం రైతు సంఘం జిల్లా కార్యదర్శి గారపాటి వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో రైతుల సమస్యలపై చర్చించారు. పొలాలకు 9 గంటలు ఇవ్వాల్సిన కరెంటును 8 గంటలు మాత్రమే ఇస్తున్నారని, దీనివల్ల రైతులకు నీరందక పంటలు ఎండిపోయే పరిస్థితి వస్తుందని తెలిపారు. నారుమళ్ల సమయంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేక నారుమళ్లు ఎండి పోతున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కరెంట్ బిల్లు పెంచడం వల్ల రైతులపై అధిక భారం పడుతోందని తెలిపారు. కొత్త ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు ఒక్క రైతుకు కూడా రైతు భరోసా అంద లేదని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సంఘం అధ్యక్షుడు కంకటాల బుద్ధుడు, రామనాథం మురళీకృష్ణ, ఆలపాటి శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.



బాధితులకు నగదు అందజేస్తున్న మాజీ ఎంపీ మార్గాని భరత్

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని తాడిపర్రులో ఇటీవల జరిగిన విద్యుతాఘాతంతో మరణించిన వారి కుటుంబ సభ్యులను బుధవారం రాజమహేంద్రవరం మాజీ ఎంపీ మార్గాని భరత్ పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ఆయన సానుభూతి తెలిపారు. పార్టీ తరపున మతుల కుటుంబాలను అన్ని రకాలుగా ఆదుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా మతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.25 వేల చొప్పున నగదు రూపేణా ఆర్థిక సహాయం ఆయన స్వయంగా అందజేశారు. ఉదయం మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ కూడా బాధితులను పరామర్శించారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

మండల సమాఖ్య ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి-గోపాలపురం

గోపాలపురం డ్వాక్రా మండల సమాఖ్య ఎన్నిక బుధవారం నిర్వహించారు. మండల గ్రామ సంఘాల విఒఎలు ఐదుగురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఎపిఎం పెనుమాక రోజ్ మాణిక్యం తెలిపారు. మండలంలో 53 గ్రామ సంఘాలు ఉండగా 48 మంది విఒఎలు మండల సమాఖ్య కార్యాలయంలో ఎన్నికకు హాజరైనట్లు తెలిపారు. 43 మంది సభ్యులు కలిసి ఐదు మంది బాడీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన మండల సమాఖ్య అధ్యక్షురాలుగా కాకర్ల రామ తులసి, వైస్ ప్రెసిడెంట్‌గా పాబోలు రాధిక, సెక్రటరీ మల్లె మొగ్గల యశోద, కోశాధికారి మల్లిపూడి రమాదేవి, కార్యనిర్వాహక కార్యదర్శి బచ్చు మహాలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన బాడీ ఎన్నికైన అనంతరం ఎపిఎం రోజ్ మాణిక్యం వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మండల సమాఖ్య ప్రెసిడెంట్ కాకర్ల తులసి మాట్లాడుతూ మండలంలో ఉన్న రికవరీలు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మండల సమాఖ్య అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానని ఆమె తెలిపారు. డ్వాక్రా రుణాలు, ప్రత్యేక లోన్లు అందించే విధంగా మహిళల ఆర్థికాభివృద్ధి కృషి చేస్తామని ఆమె తెలిపారు. డ్వాక్రా సంఘాలు సభ్యులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె తెలిపారు.



సర్వేపై సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ప్రతినిధులు

నైపుణ్య గణనపై సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి - సీతానగరం

బుధవారం సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో ఇఒపిఆర్‌డి మూర్తి ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులకు స్కిల్ డెవలప్మెంట్‌పై ట్రైనింగు ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. ఆయా పంచాయతీల పరిధిలో ఉన్న యువతీ యువకులను గుర్తించి అవసరమైన నైపుణ్యాలను అందించే విధంగా సర్వే చేయడానికి తర్ఫీదు శిక్షకులు ఫణి కుమార్, ధన రాజేష్ సచివాలయం సిబ్బందికి తరగతులు నిర్వహించారు. ఎలాంటి నైపుణ్యాలకు డిమాండ్ ఉందో అలాంటి నైపుణ్యం కలిగిన వారు ఎంత మంది ఉన్నారు. డిమాండ్‌కు, లభ్యతకు మధ్య అంతరం ఎంత ఉంది వంటి విషయాలను అంచనా వేయడానికి శిక్షణ ఇచ్చారు.స్కిల్ సెన్సస్ ద్వారా యువతలో నైపుణ్యాలను గుర్తించి, అవసరమైన మేరకు మెరుగుపరిచడానికి దోహద పడుతందని ఇఒపిఆర్‌డి మూర్తి తెలిపారు. తద్వారా ఉపాధి అవకాశాలు పెంచి అసలైన అభివృద్ధి. నిజమైన సంక్షేమం. యువత తన కాళ్లపై తాము నిలబడేందుకు అనుగుణంగా ప్రభుత్వం దీన్ని రూపొందించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ టి.గణేష్ కుమార్, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ శివ గోపాల్, జూనియర్ అసిస్టెంట్ సుమతి తదితరులు పాల్గొన్నారు.



జాబ్ మేళాలో పాల్గొన్న ప్రతినిధులు

జాబ్ మేళాలో 80 మంది ఎంపిక

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాలో జిల్లా వ్యాప్తంగా వివిధ కళాశాలలకు చెందిన 250 మంది విద్యార్థులు హాజరవ్వగా 80 మంది విద్యార్థులు ఎంపిక అయ్యారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్.కె ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. కళాశాలలో జరిగిన ప్రారంభ సభలో ముఖ్య అతిధిగా ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ పి.సురేష్ వర్మ హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థీ ఈ ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ జాబ్ మేళాకు ప్రముఖ బహుళ జాతి సంస్థలు బెంగళూరు నుంచి, రాజమండ్రికి చెందిన కంపెనీల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. విద్యార్థులకు ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు.

పనిదినాల్లో శిక్షణను నిలిపేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పాఠశాల పని దినాల్లో హెచ్‌ఎంలకు శిక్షణను నిలిపివేయాలని పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురుదుర్రు గ్రామం పాఠశాల హెచ్‌ఎం పివి.రత్నకుమార్ మృతికి ఆయన సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆగిరిపల్లిలో జరిగిన హెచ్‌ఎంల శిక్షణ తరగతుల్లో ఉండి మండలం గురుదుర్రు గ్రామానికి చెందిన హెచ్‌ఎం పివి.రత్నకుమార్ గుండెపోటుకు గురై మృతి చెందడం విచారకరమన్నారు. ప్రధానోపాధ్యాయులకు పని దినాల్లో నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ శిక్షణ తరగతులను నిలుపుదల చేయాలని ఆగస్టు 16న, పలుమార్లు రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులను కోరినా చర్యలు తీసుకోకపోవడం వల్ల ఇటువంటి సంఘటన జరిగిందన్నారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాలలో పరీక్షలు నిర్వహించే సమయం, అపార్, 10వ తరగతి నామినల్ రోల్స్ సమర్పించాల్సిన సమయం, మెగా పేరెంట్ సమావేశం నిర్వహించాలని ఒక పక్క చెబుతూనే మరోపక్క రెసిడెన్షియల్ శిక్షణా తరగతులు నిర్వహించడం సరైంది కాదన్నారు. ఏకకాలంలో అనేక పనులను అప్పగిస్తూ తీవ్రమైన ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు.



మోనిషాను అభినందిస్తున్న తుమ్మిడి అరుణ్‌కుమార్, కరస్పాండెంట్ శ్యాంప్రసాద్, ప్రిన్సిపల్ గురయ్య తదితరులు

జాతీయ స్థాయి విలువిద్య పోటీలకు

గురుకులం విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జాతీయ స్థాయి విలువిద్య పోటీలకు రాజమహేంద్ర వరంలోని శ్రీ సత్యసాయి గురుకులం విద్యార్థిని వర్రి మోనిషా ఎంపికైంది. ఇటీవల మన్యం జిల్లా పార్వతీపురంలో 68వ ఎపి స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీల్లో మోనిషా పాల్గొని ప్రతిభ కనబర్చి రజత పతకం సాధించింది. తద్వారా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. మోనిషాను అభినందించారు. ముఖ్యఅతిథిగా వ్యాపారవేత్త తుమ్మిడి అరుణ్‌కుమార్ హాజరై మాట్లాడారు. క్రీడలతో శారీరక ధ్రుడత్వంతో పాటూ మానసిక స్థయిర్యం, ఏకాగ్రత పెరుగుతాయన్నారు. తద్వారా చదువులోనూ రాణించే అవకాశం ఉంటుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్లో క్రీడాశక్తిని గుర్తించి ఆ దిశగా ప్రోత్సహించాలన్నారు. అనంతరం శ్రీ సత్య సాయి గురుకులం కరస్పాండెంట్ శ్యాంసుందర్, ప్రిన్సిపల్ కె.గుర్రయ్య మాట్లాడారు. తమ పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు, చిత్రలేఖనం, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర అంశాల్లో తగిన ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. ఈ నెలాఖరున గుజరాత్‌లో జరిగే జాతీయస్థాయి విలువిద్య పోటీలకు వర్రి మోనిషా పాల్గొంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుకులం కమిటీ సభ్యులు సోమసుందర్ రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు శ్రీరామగుప్త తదితరులు పాల్గొన్నారు.

11న భవన నిర్మాణ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నవంబర్ 11న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ పిలుపు ఇచ్చింది. బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఎఐటియుసి జిల్లా కన్వీనర్ కె.రాంబాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ, ఎఐటియుసి జాతీయ సమితి సభ్యులు తోకల ప్రసాద్ మాట్లాడుతూ ఇసుక, నిర్మాణ రంగంలో ముడి సరుకులు అధిక ధరలను నియంత్రించాలని, బిల్డింగ్ నిర్మాణంలో సెస్ రూపంలో వసూలు చేస్తున్న నిధులు భవన నిర్మాణ కార్మికులకే ఖర్చు చేయాలని, సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని, నిర్మాణ రంగంలో పనిచేస్తున్న 36 రంగాల పనులు నిలుపుదల చేసి 11న కలెక్టరేట్‌కు తరలిరావాలని వారు పిలుపునిచ్చారు

గురుకుల పాఠశాలను సందర్శించిన తుమ్మలపల్లి

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని వీరలంకపల్లి బాలికల గురుకుల పాఠశాలను బుధవారం జనసేన పార్టీ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ సందర్శించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలో ఉన్న సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ ఆర్‌ఒ ప్లాంట్ పనిచేయడం లేదని, వాటర్ సరిపోవడం లేదని, నూతనంగా ట్యాంక్ నిర్మించాలని తెలిపారు. కేర్ టేకర్ పోస్ట్ ఖాళీగా ఉన్నందున కాళీ పోస్టును భర్తీ చేయాలని, పిల్లలకు గదులు సరిపోకపోవడంతో నాలుగు గదులు అవసరమని, బెడ్స్ ఏర్పాటు చేయాలని రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించి మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు గురుకుల పాఠశాలను సందర్శించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పదిలం మురళి, గాజింగం నాని, ప్రగడ ప్రభ, గుల్లింకల నాని, శివరామకృష్ణ, నాగేశ్వరావు, నరేంద్ర, శవ, దేవి, పాండవులు, రామకృష్ణ, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న రమేష్

గ్రామాభివృద్ధికి ఇచ్చిన తీర్మానం ఎక్కడ..

ప్రజాశక్తి - నల్లజర్ల

గ్రావవాభివృద్ధికి మీరు ఇచ్చిన తీర్మానం ఎక్కడుందని వైసిపి నాయకులను టిడిపి నాయకులు ప్రశ్నించారు. నల్లజర్ల మండలం అచ్చెన్నపాలెం గ్రామంలో రెండు రోజులుగా గ్రామ అభివృద్ధిపై జరుగుతున్న ఉపాధి పనికి తీర్మానం వార్‌లో భాగంగా టిడిపి నాయకులు స్పందించారు. బుధవారం పాతూరి ఆదినారాయణ ఇంటివద్ద ఏర్పాటుచేసిన పత్రిక సమావేశంలో వారు మాట్లాడారు. వైసిపి సర్పంచ్ గత రెండు మూడు, నెలలుగా గ్రామాభివృద్ధికి సంబంధించి ఇచ్చిన తీర్మానం ఉంటే మీరన్నట్లే బహిరంగ సమావేశంలో ప్రజలకు చూపించాలన్నారు. అందుకు ఎప్పుడైనా ఎక్కడైనా తాము సిద్ధమని గ్రామ టిడిపి నాయకుడు పాతూరి సత్యనారాయణ అన్నారు. గత రెండు నెలలుగా గ్రామానికి సంబంధించి పొలాల్లోకి వెళ్లే రహదారికి అత్యవసరమైన కల్వర్టు నిర్మించేందుకు సర్పంచ్ భర్త అయిన జాలపర్తి వెంకటరత్నం ను పలుమార్లు తీర్మానం ఇమ్మని అడిగితే రేపు ఎల్లుండి అంటూ ఇవ్వకపోవడం, ఉపాధి హామీ పనులకు సంబంధించి రైతులకు తీర్మానం ఇవ్వకపోవడంతో సోమవారం ఎంపిడిఒను ఆశ్రయించామని ఆదినారాయణ తెలిపారు. గ్రామంలో అభివృద్ధి పనులకు ఆటంకం కాదని, నాలుగు గోడల మధ్య మాట్లాడడం సరికాదని బహిరంగ చర్చకు రావాలంటూ ప్రత్తిపాటి గంగారావు, కూచిపూడి సత్యనారాయణ, కాకర్ల రాంబాబు సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో పాతూరి రమేష్, కూచిపూడి నరసారావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ పేరున సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-కడియం

కడియం మండలం, బుర్రిలంక గ్రామానికి చెందిన చిరు సేవా సమితి సభ్యులు నాగిరెడ్డి హనుమంతు మాతృమూర్తి మంగ ఇటీవల మరణించడంతో అమ్మపై ఉన్న ప్రేమతో గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆమె ఎంతోమందికి అన్నదానం చేసి బుర్రిలంక అన్నపూర్ణగా పేరుగాంచారని, తన మరణాంతరం కూడా అదే సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పలుమార్లు తమకు తెలిపేదంటున్నారు కుటుంబ సభ్యులు. భర్త రాముడు, కుమారులు నాగిరెడ్డి హనుమంతు(అంజి), నాగమణి దంపతులు, హరిబాబు, దుర్గ దంపతులతో పాటు కుమార్తె గట్టి లక్ష్మి, శ్రీను దంపతులు బుర్రిలంక చిరు సేవాసమితి అధ్యక్షుడు గెడ్డం శివ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని ప్రియదర్శిని చెవిటి మూగ పాఠశాలకు చెందిన ప్రత్యేక అవసరాలు గల 150 మంది విద్యార్థులను భోజనానికి ఆహ్వానించారు. రెండు ప్రత్యేక బస్సుల్లో బుధవారం బుర్రిలంక తీసుకువచ్చారు. భోజనం అనంతరం వారి తల్లి కోరిక మేరకు చిన్నారులకు మంచినీటి ఫ్లాస్కులను బహుకరించారు. మధ్యాహ్నం భోజనంతో పాటు రాత్రి కూడా భోజనాలు ఏర్పాటు చేశారు.



చిన్నారులకు ఫ్లాస్కులు అందజేస్తున్న కుటుంబ సభ్యులు

యానాం వార్తలు



అధికారులతో సమీక్షిస్తు ఎంఎల్ఎ అశోక్

పిడబ్ల్యూడి అధికారులతో ఎంఎల్ఎ సమీక్ష

ప్రజాశక్తి - యానాం

ప్రజా పనుల శాఖ(పిడబ్ల్యూడి) అధికారులతో ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ బుధవారం పలు సమస్యలపై సమీక్షించారు. పెండింగ్లో ఉన్న పనులపై అధికారులను ఆర్ఎఒ మునిస్వామి సమక్షంలో వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిఎస్ఆర్, ఎంఎల్ఎ నిధులు, ఎడి వెల్ఫేర్ ద్వారా జరగాల్సిన పనులు ఎందుకు పెండింగ్లో ఉన్నాయని ప్రశ్నించారు. పుదుచ్చేరిలో ఉన్న సంబంధిత సెక్రటరీ, డైరెక్టర్లతో సిఎస్ఆర్ నిధులు మొదటి పేస్, ఎన్ఐటిలో ఉన్న 9 పనులకు సంబంధించి ఫోన్లో మాట్లాడారు. వన్ స్టాప్ సెంటర్, కనకాలపేట ఇండోర్ స్టేడియంలో పెండింగ్లో ఉన్న పనులు పూర్తి చేసి తక్షణమే ప్రారంభించాలన్నారు. అరటికాయలంక నుంచి జండా స్థంభం వరకూ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించిన ఇంతవరకు పనులు ప్రారంభించకపోవడంపై మండిపడ్డారు. సంబంధిత కాంట్రాక్టర్‌ను పిలిచి పనులు త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. ఫైనాన్స్ సమస్యలు ఉంటే తనకు తెలపాలని, పుదుచ్చేరి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆర్ఎఒ, ఇఇలకు సూచించారు. ప్రధాన రహదారుల్లో గ్యాస్ పైప్‌లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. మున్సిపల్ శాఖలో ఉన్న సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో ప్రజా పనుల శాఖ ఇఇ చంద్రశేఖరన్, ఎఇ కాళ్ల నాగరాజు, జెఇ జ్యోతిరాజు, భాస్కర్, పురపాలక శాఖ జెఇ కుమార్, ఆదిబాబు, వేణు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పర్యావరణ పరిరక్షణ కోసం కృషి

ప్రజాశక్తి - యానాం

పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్నట్లు జిల్లా యువజన అధికారి తిర్రి గోపి అన్నారు. బుధవారం స్థానిక ఎస్‌టిపిపి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులచే పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రత్నప్రభ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు రాయితీ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ జిల్లా కన్వీనర్, రాష్ట్ర కార్యదర్శి, ఎం.శ్రీరామమూర్తి, రాజమండ్రి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కె.పార్థసారధి జిల్లా కలెక్టర్ ప్రశాంతిని కలిసి ప్రైవేట్ విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ 50 శాతం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఇటీవల కోరారు. జర్నలిస్టుల వినతిపై స్పందించిన జిల్లా కలెక్టర్ ప్రశాంతి బుధవారం ఇందుకు సంబంధించిన సర్కులర్ జారీ చేశారు. 2024-2025 విద్యా సంవత్సరంలో ఈ ఉత్తర్వులు అమలయ్యేలా జిల్లా పాఠశాల విద్యాధికారి, డిప్యూటీ విద్యాధికారులు, ఆఫీసర్, మండల విద్యాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆ సర్కులర్‌లో కలెక్టర్ ఆదేశించారు.